కొత్త ఆశలతో నవ వసంతంలోకి..

- గ్రామాలు, పట్టణాల్లో నూతన సంవత్సర సందడి
- మార్కెట్‌ను ముంచెత్తిన పూలు, పండ్లు
- బేకరీల్లో హాట్‌హాట్‌గా అమ్ముడైన కేకులు
- విరివిగా వెలిసిన బిర్యానీ పాయింట్లు
- రంగవల్లులతో కళకళలాడిన ఇళ్లు


తాళ్లపూడిలో విక్రయిస్తున్న పూల బొకేలు, దండలు

తాళ్లపూడి/చాగల్లు : తీపి చేదు జ్ఞాపకాలను పాత ఏడాదికి విడిచిపెట్టి.. కొత్త ఆశలతో నవ వసంతంలోకి అడుగు పెట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కొత్త ఏడాదిలో తమకు అంతా మంచే జరగాలని ఆకాంక్షిస్తూ, అందరూ బాగుండాలని కోరుకుంటూ మరో మైలురాయిని అధిగమించేందుకు ముందుకు సాగారు. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరికీ కొంగొత్త అనుభూతి. స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా రంగప్రవేశం చేయడంతో అందరూ పోటీపడి మరీ న్యూ ఇయర్ అభినందనలతో పోస్టింగులు చేస్తూ బిజీగా గడుపుతున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌లో సందేశాలు పంపడంలో అధిక శాతం మంది నిమగ్నమయ్యారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని తాళ్లపూడి మార్కెట్‌లో బేకరీలు, పూలు, పండ్ల దుకాణాలు, రంగులు, వస్త్ర దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. గడిచిన సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, నూతన ఏడాదిని ఆహ్వానిస్తూ మహిళలు ఇళ్ల వద్ద అందంగా రంగవల్లులు వేశారు. మండలంలో ఎక్కడికక్కడ బిర్యానీ సెంటర్లు వెలిశాయి. ఒక బిర్యానీ కొంటే మరొకటి ఉచితం, రెండు కొంటే ఒక గిఫ్ట్, కూల్‌డ్రింక్ ఉచితమంటూ ఊదరగొట్టారు. సాధారణ, కాంబో ప్యాక్ బిర్యానీ రూ.120 నుంచి రూ.260 వరకు విక్రయించారు. మార్కెట్లో వివిధ రకాల పూల బొకేలను విక్రయిస్తున్నారు. బేకరీల్లో అనేక ఆకారాలు, రంగులు, సైజుల్లో కేక్‌లను విక్రయించారు. తమ అభిమాన రాజకీయ నాయకులకు, తమ పై అధికారులకు, ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఉద్యోగులు బొకేలతో పాటు, పూలు, పండ్లు కొనుగోలు చేస్తూ బిజీ అయ్యారు.

కొత్త ఏడాదిలో ఆనందంగా ఉండాలి

నల్లజర్ల: కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మంగళవారం ముసుళ్లగుంట పంచాయితీ కార్యాలయం వద్ద పాలకవర్గం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త ఏడాదిలో మంచి ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలన్నారు. సర్పంచ్ నందమూరి శారదాదేవి, వార్డు సభ్యులు కొయ్యలమూడి కృష్ణమూర్తి, వెల్లి సుబ్బారావు, పాకలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయం వద్ద వేడుకలు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి తానేటి వనిత తెలిపారు. ఉదయం నుంచి నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులకు కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు వేడుకల్లో పాల్గొనాలన్నారు. నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులకు ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

నిడదవోలు : పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసనాయుడు మంగళవారం ఉదయం 9.30 నుంచి పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారు.

రికార్డుల్లేవు.. మస్టర్లపై సంతకాల్లేవు

సామాజిక తనిఖీలో వెలుగు చూసిన అవకతవకలు


టీపను నిలదీస్తున్న పీడీ నాగమహేశ్వరరావు

పెరవలి: ఉపాధి హామీ పథకం పనులు అవినీతిమయంగా ఉన్నాయని, రికార్డుల నిర్వహణ లేదని, నిధులు మాత్రం డ్రా చేశారంటూ పీడీ ఏ నాగమహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం జరిగింది. పీడీ మాట్లాడుతూ, మండలంలో 2023–24లో 520 పనులను రూ.6.85 కోట్లతో చేశారని, ఇందులో రూ.1.60 లక్షల అవినీతి జరిగిందని చెప్పారు. రికార్డుల నిర్వహణ లోపం, రికార్డుల అదృశ్యంపై పెనాల్టీగా రూ.18 వేలు వేశామని తెలిపారు. కొలతలు తక్కువ, కూలీలు ఎక్కువగా చూపించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానాలు వేశామన్నారు. ఎక్కడా మస్టర్లు లేవన్నారు. మండలంలో మట్టి పూడికలు చేసిన వాటికి మూడేళ్లుగా బిల్లులు రాలేదని సర్పంచ్‌లు చెప్పడంతో, ప్రభుత్వానికి నివేదికలు అందించామని తెలిపారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఏపీడీ బి.రాంప్రసాద్, ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణ పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి


దేవరపల్లి బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

దేవరపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు వామపక్షాల నాయకులు మంగళవారం దేవరపల్ల బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా క్షమాపణ చెప్పి, రాజీనామా చేయాలని, సీపీఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సీహెచ్ రమేష్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర నాయకుడు షేక్ మస్తాన్, సీఐటీయూ నాయకులు ఎస్.భగత్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్న అమిత్‌షా.. అంబేడ్కర్‌ను అవహేళనగా మాట్లాడడం తగదన్నారు. దీనిని రాజ్యాంగంపై జరుగుతున్న దాడిగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఎం.సుందర్‌బాబు, వామపక్షాల నాయకులు కె.పెంటయ్య, కె.రత్నాజీ, ఎ.శ్రీనివాస్, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వామపక్షాల నాయకులు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు మనుధర్మాన్ని తెచ్చేందుకు యత్నిస్తున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు విమర్శించారు.

సమన్వయంతో పనులు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

నిడదవోలు రూరల్: మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పూర్తిచేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ ఎర్ర కాలువ ముంపుతో నష్టపోయిన రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.కంసాలిపాలెం, మునిపల్లి సర్పంచ్‌లు కొండపల్లి శ్రీనివాస్, వెలగన నరేష్‌లు మాట్లాడుతూ, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన విలేజ్ క్లినిక్‌ల్లో ఎంఎల్‌హెచ్‌పీలు అందుబాటులో ఉండటం లేదని విమర్శించారు. నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తాళ్లపాలెం వద్ద ఆక్రమణలు, కలవచర్లలో తాగునీటి సమస్య తదితర విషయాలపై చర్చించారు. జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, తహసీల్దార్ నాగరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన మంత్రి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి: రోడ్ల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు–నరసాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను మంగళవారం ఆయన పెరవలిలో పరిశీలించారు. ఈ రోడ్డు శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. రోడ్డు అభివృద్ధికి రూ.1.7 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఈ రోడ్డులో ఉసులుమర్రు–కానూరు మధ్య 1.8 కి.మీ. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.3.1 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. జనవరి నెలాఖరు నాటికి రోడ్డు మరమ్మతులు పూర్తవుతాయన్నారు.

ఉండ్రాజవరం : ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పసలపూడి గ్రామంలో మంగళవారం ఆయన పలువురు లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు.

యువత పెడదోవ పట్టవద్దు

గోపాలపురం: నూతన సంవత్సర స్వాగతం పేరుతో యువత పెడదోవ పట్టవద్దని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ అన్నారు. దొండపూడి గ్రామంలో ప్రగతిశీల యువజన సంఘం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యా. వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమించాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

కొవ్వూరు: డివిజన్ పరిధిలో రేషన్ డీలర్ల రాజీనామా, మరణించడం తదితర కారణాలతో ఏర్పడిన ఖాళీలను శాశ్వత భర్తీ చేసేందుకు జనవరి ఒకటో తేదీన నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ,చ డీలర్ల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఉంటుందన్నారు. నిబంధనలకు లోబడి అభ్యర్థులు దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయం లేదా ఆర్డీఓ కార్యాలయంలో పదో తేదీలోగా అందజేయాలన్నారు. వివరాలు ఆయా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

భూముల రీ సర్వేపై అవగాహన సదస్సు

దేవరపల్లి: భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి కోరారు. మండలంలోని చిన్నాయగూడెంలో భూముల రీ సర్వేపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. తొలుత గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, మూడో విడతలో గ్రామం రీ సర్వేకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెల 2 నుంచి గ్రామంలో రీ సర్వే ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. గ్రామ ప్రజలు సర్వే అధికారులకు సహకరించి, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డేగపాటి జ్యోతిరాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ ముమ్మిడి వీరవెంకట సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎం. రాణి, మండల సర్వేయర్, వీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.

భీమోలులో క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ లలిత

గోపాలపురం: రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నదే వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని గోపాలపురం జెడ్పీటీసీ కాకులపాటి లలిత అన్నారు. మండలంలోని భీమోలు గ్రామంలోని చర్చిలో మంగళవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ప్రజలకు ఎనలేని సేవలందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఆమె చెప్పారు. ప్రజలకు దేవుని ఆశీస్సులు తప్పక ఉంటాయన్నారు. దైవజనులు బెంజి శ్యామ్యూల్, పాస్టర్ ఐజాక్, బిల్‌గేట్, లూథరన్ చర్చి ఫారిస్ డెలిగేట్ కె.జగన్, కాకులపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చేపట్టాలి

నల్లజర్ల: ప్రస్తుతం మొక్కజొన్న పంటలో కాండం తొలుచు పురుగు ఉధృతంగా ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎంఏఓ కమల్‌రాజ్ అన్నారు. మంగళవారం అచ్చన్నపాలెం, ఆవపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ కాండం తొలుచు పిల్ల పురుగులు మొక్కజొన్న అంకురంలోకి చేరి, దానిని తినడంతో మొక్క చనిపోతుందన్నారు. దీని నివారణకు క్లోరంటానిలిప్రోల్ 0.3 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడి ఎన్నిక

తాళ్లపూడి: వేగేశ్వరపురానికి చెందిన ఇండుగుల రామకృష్ణ రెండోసారి బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాళ్లపూడిలో మంగళవారం ఈ ఎన్నిక జరిగింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కొవ్వూరు: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ పి.విశ్వం అన్నారు. సామాజిక, ఇతర మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తుల లింకులను ఓపెన్ చేయరాదని సూచించారు. స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

పెరవలి: రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ డి.అచ్యుతకుమారి తెలిపారు. పిట్టల వేమవరంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై రైతుల నుంచి ఐదు ఫిర్యాదులు అందాయి, సర్పంచ్ మండ హైమావతి, డీటీ సన్నిబాబు, ఆర్ఐ పావని తదితరులు పాల్గొన్నారు.